# మూడువేల ఐదువందలు

నాకు మనసు మనసులో లేకుండా పోయింది. కారణం నా పెళ్ళి విషయంలో నాకు లేని తొందర నా తల్లిదండ్రులకీ, యిరుగు పొరుగు హితైషులకీ ఎక్కువై పోయింది. "నేనిప్పుడే చేసుకోను" అంటే "ఎందుకు చేసుకోవూ?" అని వాళ్ళు అడగటంలో తప్పులేదు. నేను చెప్పిన కారణాల్ని వాళ్ళు విశాల దృక్పథంతో అర్థంచేసుకోకపోవటంలోనే వచ్చిన చిక్కల్లా. వాళ్ళకి అర్థం అయ్యే భాషలో చాలా సున్నితంగా చెప్పాను. "ఇప్పుడు నా వయస్సుదృష్ట్యా చూచినా, మన కుటుంబ పరిస్థితులదృష్ట్యా చూసినా మీరిలా నిర్బంధించటం భావ్యంకాదు. జీవితంలో నా కాళ్ళమీద నేను నిలబడ్డప్పుడుగాని ఒకళ్ళనిపోషించగలిగే అర్హతవుండదు. ఆ అర్హత యిప్పుడు నాకు లేదు" అని చెప్పాను. నే నేదో వెర్రిగా వాగుతున్నట్టుగా వాళ్ళు పెదవి విరిచేశారు. బుజం తడుతూ "అలా అని నువ్వనుకుంటున్నావు. రేపీపాటికి నీకు

ఉద్యోగం దొరకదూ! పెళ్ళి చేసుకుంటే పెళ్ళాన్నే పోషించ లేకపోతావా!" అంటూ బుజ్జగించాడు బాబయ్య.

ఇంకేం మాట్లాడేది నేను? కాదూ కూడదంటే అమ్మ కళ్ళవెంబడి కారే కన్నీరుకి అడ్డూ ఆపూ వుండదు. పదిమంది లోనూ ఆమె అలా హృదయవేదన బైటపెడితే నలుగురూ నే నేదో కర్కోటకుడ్నయినట్టూ, అందుకు ఆమె ప్రతిఫలం అనుభవిస్తున్నట్టూ ఒక తప్పుడు అభిప్రాయం నా గురించి ఏర్పడిపోతుంది. నన్ను అల్లరిపాలు చేద్దామనే ఉద్దేశంతో అలా నటిస్తోందని నే ననలేను. నలభై యేళ్ళు నిండి అయిదో పడిలోపడ్డ ఆమె "జీవితంలో సుఖపట్టం అంటూ నా ముఖాన రాసిపెట్టలేదు కాబోలు దేవుడు" అని తల మొత్తుకునేప్పుడు నిజంగా నా గుండెలు నీరయిపోతాయి. అయితే వొచ్చిన చిక్కల్లా యిరుపక్షాల వాదనలూ సబబుగా వున్నట్టు నా మనస్సులో నాకే అనిపిస్తోంది. ఎటూ తేల్చుకోలేకపోతున్నాను. "పిల్ల అందంగా వుండాలి, చదువుకుంటేగాని పనికిరాదూ, డబ్బులేనివాళ్ళతో ప్రమేయంలేదు" ఇటువంటి సంకుచితమైన అభిప్రాయాలకి నాలో తావులేదు. పెళ్ళిప్రస్తావన వచ్చినప్పుడల్లా నేను వ్యతిరేకించటానికి కారణం పైన చెప్పాను.

"వాళ్ళు ఏమంత పెద్ద ఫాయీలోవాళ్ళు కాకపోయినా మన అంతస్థుకి తగినవాళ్ళే. మూడువేల అయిదు వందలు కట్నం యిస్తున్నారంటే ఆలోచించు. అంతకంటె ఎక్కువకట్నాపేక్ష మనకుండకూడదు" నాన్నగారనే ఈ మాటల్లో నేను కట్నం కోసం ప్రాకులాడే సంకుచితమైన

x unconscious tyranny.

వ్యక్తిననే భావం గర్భితమై వుంది. నాకు అరికాలుమంట నెత్తికెక్కింది. తమాయించుకున్నాను. వీళ్ళు బొత్తిగా మూర్ఖులు. ప్రపంచాన్నంతా తమ దృష్టితోనే కొలుస్తారు. అంతా తమలాంటి అభిప్రాయాలే కలిగి వుంటారని భావిస్తారు. అదే అభిప్రాయాల్తో యెదుటివాళ్ళకి నీతులు చెప్పటానికి ప్రయత్నిస్తారు. అవసరమైతే ఒక్క అడుగైనా ముందుకు వేసి 'నేను త్యాగం చేస్తాను' అని చెప్పుకోలేరు. వాళ్ళు చేసే పనులన్నీ వాళ్ళ దృష్టిలో ఘనకార్యాల్లాగానే కనిపిస్తాయి. మూడువేల అయిదువందలకంటె యెక్కువ కట్నం పుచ్చుకోకపోవటం గొప్ప సంస్కారం అయినట్టు యిప్పుడు నాన్నగారు మాట్లాడలా? వాళ్ళ ముక్కుపిండి అంతసొమ్ముకి నన్ను అమ్ముకుంటూ కూడా తామేదో వాళ్ళకి మహోపకారం చేస్తున్నట్టూ, అందుకు వాళ్ళు కృతజ్ఞులై ఉండాలన్నట్టూ భావించడం! ఇంట్లో ఉన్నంతసేపూ నాన్నగారో, అమ్మో, బాబయ్యో, ఎవరో ఒకరు ఆ ప్రస్తావన తీసుకురావటం మానరు. నాకు వెర్రెత్తిపోయి నాలుగు ఏవో అనటం మానను. ఇలాగుంది. వీధిలోకిపోతే పెద్దమనుషులు ఎవరో ఒకరు కనిపించి "మీ నాన్నగారు అంతగా ప్రాధేయపడుతూంటే ఆ మాత్రం ఆయన కోరిక తీర్చలేవుటోయ్! చిన్నతనంలో పెళ్ళి చేసుకుంటేనే ముద్దూ ముచ్చటాను. తాటిచెట్టులా ఎదిగింతర్వాతనా పెళ్ళి చేసుకోవటం?" అంటూ నాకు హితబోధ చేసేవాళ్ళు రోజుకొక్కరైనా ఉండకపోరు. మా సమస్యలేమిటో నావాళ్ళకే అర్థం కానప్పుడు వాళ్ళకేం అర్థం అవుతాయి! పెద్దవాళ్ళు చెప్పేవన్నీ అవశ్యం

ఆచరణీయాలనీ, చిన్నపిల్లలు చెప్పేవన్నీ అనుభవ శూన్య మైన మాటలనీ భావించే తెగకు చెందినవాళ్ళంతా నాకు తారసపడి నాకేమీ తెలియనట్టుగా మాట్లాడుతుంటే నే నేమని చెప్పి వాళ్ళని నా వైపుకి తిప్పుకునేది? అందుకని పైవాళ్ళు ఎవరేమన్నా "ఓరి పిచ్చివాళ్ళల్లారా!" అన్నట్టుగా గంభీరంగా ఓ చిరునవ్వు నవ్వటం నేర్చుకున్నాను. అలాగే నవ్వుతుంటే వాళ్ళింతముఖం చేసుకుని వెళ్ళిపోతున్నారు. ప్రస్తుతం నాకు ఉద్యోగంలేదు. నాన్నగారు రిటైరు అయి పోయారుకాబట్టి మునుపటి ఆ కాస్త ఆదాయం కూడా పోయింది. ఇంటి అద్దెమీద యిలా కాలక్షేపం చేస్తున్నాం. అలా సున్నితంగా నడుస్తున్నాయిరోజులు. ఏ మాత్రం బరువు ఎక్కువైనా మా సంసారనౌక బుడుంగుమని మునిగి ఊరు కుంటుంది. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో నాకు సంబంధించిన మరోవ్యక్తి యీ యింట్లో అడుగుపెడితే అంతపనీ జరిగి తీరు తుంది. తర్వాత పర్యవసానం ఎంత అవాంఛనీయంగా పరిణ మిస్తుందో నేను వూహించగలిగానుగాని, పెద్దవాళ్ళూ అను కున్నవాళ్ళు ఆలోచించలేకపోయారు.

ఇంటిగుట్టు బైటపట్టానికి తప్పించి యిటువంటి పనులు దేనికి? అసలు వీటన్నిటికన్న ప్రబలమైన మరోకారణం వుంది. సంఘంలో దురన్యాయాల్ని చీల్చి చెండాడే నేను తగుదు నమ్మా అనిగుప్‌చిప్‌గా మూడు వేలఅయిదువందలూ కట్నం పుచ్చుకోవటం భావ్యమా? నలుగురూ ఉమ్మెయ్యరూ? నలుగురి మాట అలాగుండనీ నా అంతరాత్మ అందుకు సమ్మ

తించొద్దూ? ఎముకు తినుగుతోంది. అలా వీలులేదు. "పోనీ కట్నం పుచ్చుకోకుండా పెళ్ళిచేసుకో?" అనే ప్రశ్న యెవరైనా వెయ్యొచ్చు. దానికీ నా దగ్గర సమాధానం వుంది. పైనే చెప్పాను కూడాను. స్వల్ప ఆదాయంలో గుట్టుగా గడుపుకుంటున్న మా సంసారం వెయ్యిరూపాయల పెళ్ళి ఖర్చులు భరాయించగలదా? ఎవరిస్తారు అప్పు. ఇచ్చినా తీర్చుకునేమార్గం? ఈ సమస్యలన్నీ కేవలం మన బుద్ధిమాంద్యంవల్ల ఉత్పన్నమవుతున్నవే. కోరి లంపటంలో దిగబడ్డం అన్నమాట! కాబట్టి నాకు ఉద్యోగం అంటూ ఒకటి దొరికే వరకూ ఒక ఆడదానిమెళ్ళో పుస్తె కట్టటం తగని పని అని నిర్ధారించుకున్నాను. ఎవరెంతచెప్పినా నా నిశ్చలత్వాన్ని విడనాడ కూడదని నిశ్చయించుకున్నాను. ఇంతవరకూ చలించలేదు. కట్నం మాటుకు నా కంఠంలో ప్రాణం వుండగా తీసుకోకూడదు. నాలో ఏ మాత్రం సంస్కారం ఉన్నా అంతపని చెయ్యగలనా ?

"మేమంతా చిన్నప్పుడే చేసుకోలేదూ! ఈ నాడంటే యిలా వెర్రి వెర్రి వేషాలు వేస్తున్నారుగాని" అంటూ నాన్న విసుక్కుంటాడు.

"మీరూరుకోండి. ఎవరి ముఖాన ఎంత రాసివుంటే అంతే. నా ముఖాన దేవుడు అంతే రాసిపెట్టాడు. ఈ యంత్రంలో శక్తి వున్నంతకాలం యిలా చాకిరీచేస్తాను" అంటుంది అమ్మ. నాన్నధోరణి మనసుని వెర్రెత్తిస్తే అమ్మ ధోరణి శీతల పవనంలా మనసుని చల్లపరుస్తుంది. నేను ఎప్పటికైనా

నా ప్రతిజ్ఞని పాటించలేక ఓడిపోవటం సంభవిస్తే అందుకు బాధ్యురాలు అమ్మేకాని తదితర మొగరాయిళ్ళు యెంత మాత్రం కాదు; వాళ్ళెన్ని చెప్పినా నేను ఖాతరుచెయ్యను. ఇంతెడు బాధ్యతల్ని యిన్నాళ్ళూ సంతోషంగా స్వీకరించిన అమ్మ యిటీవల గతిలేనట్టుగా యీడుస్తూ గడుపుతుందంటే అందుకు నేనూ కొంతవరకూ బాధ్యుడ్నే. ఈ వయసులో నన్నా ఆమెముందు నిలబడి, "ప్రతి పనిలోనూ నేనున్నానులే అత్తా, నే చేసిపెడతాలే" అనే మనిషి ఆసరా యెంత అవసరమో, ఆ కోరిక ఎంత వాంఛనీయమో నేను అర్థంచేసుకోక పోలేను.

పోనీ ఆ మూడు ముళ్ళూ వేసేస్తే?

అయ్యో! అంతపనే? నా ప్రతిజ్ఞ? నా సంస్కారం? నే చేసే రచనలూ, చెప్పే నీతులూ వీటన్నిటినీ ఓ మూలకు నెట్టెయ్యనా! నా ఆత్మకి విరుద్ధంగా వ్యతిరేకంగా నడుచుకోనా? చేజేతులా తెలుసుండికూడా నా నూరేళ్ళ బ్రతుకునీ ఒక క్రమబద్ధంలో కాకుండా యెటు అడ్డదారి కనిపిస్తే అటలా తిప్పించి ముళ్ళడొంకల్లోంచి, మురికి కాల్వల్లోంచి నడిపించనా? ఒక ఆదర్శం, ఆశయం అంటూ లేని జీవితం గడపటంలో నాబోటి కాస్తో కూస్తో తెలుసున్న మనిషికి యెంత యమయాతనగా వుంటుందో నేను వేరే చెప్పక్కర్లేదు. ఇది తప్పు అని తెలియనివాడు నిశ్చింతగా ఎన్ని తప్పులైనా చెయ్యగలగొచ్చుగాని, తెలిసినవాడు అంతపనీ చెయ్యాలంటే, ఆత్మ విరుద్ధంగా నడవాలంటే అతనిలో జరిగే దేవదానవుల సంఘర్షణకి ఒక అంతంటూ వుండదు.

ఇన్నాళ్ళూ యిలా సతమతమైపోతున్న నేను యివాళ ఉదయం జరిగిన సంఘటనతో నా మనసు చాలావరకూ మార్చుకున్నాను. రాత్రి తలనొప్పిగా వుందంటూ పడుకున్న అమ్మకి తెల్లవారేసరికి రాత్రల్లా కాసిన జ్వరం తగ్గుముఖం పట్టినా మనిషి మట్టుకు బాగా నీరసించిపోయింది. ఆమె ముందుకు పోవటానికి తప్పుచేసినవాడిలా సిగ్గుగావుంది నాకు.

"నువ్వోద్దు. పడుక్కో. నా మాటవిని ఈపూట మేమేం ఎలాగో తంటాలు పడతాం" అంటున్న తండ్రిమాటలు తలుపువార నిలబడ్డ నా చెవినిపడ్డాయి.

"ఎందుకూ? అఖ్ఖర్లేదు. నేనే వండిపడేస్తాను. మీరు పెట్టుకుని తిందురుగాని" అంటోంది అమ్మ.

నాన్న ఎంతచెప్పినా అమ్మ వినిపించుకోటంలా. ఆమె మూలుగుతూ అడుగులో అడుగు వేసుకుంటూ ఇవతలికి వస్తూంటే నిజంగా నా గుండె నీరయిపోయింది. నా నమ్మకాలన్నిటినీ ఛిన్నాభిన్నం చెయ్యగలిగే మహత్తరమైన శక్తి ఈ సన్నివేశంలో నిగూఢమై వుందికాబోలు. 'ఏదైనా సంబంధం స్థిరంచెయ్యి నాన్నా' అందాం అనిపించి నాన్న గదివేపు నడిచాను. ఇంతలో పెరట్లోంచి దబ్బుమని చప్పుడు వినిపించి గదిలోంచి నాన్నా, హాల్లోంచి నేనూ పెరటివైపుకి పరుగుతీశాం.

భావిదగ్గర బురదలో పడివుంది అమ్మ. చంకలోబిందె నేలమీదపడి దొర్లి దొర్లి చెట్టు మొదట్లో సొట్టలుపడి వుంది. నీళ్ళన్నీ దారిపొడుగుతా మడుగులుకట్టాయి.

అమ్మని లేవదీసి గదిలోకి తీసుకొచ్చి మంచంమీద కూచోబెట్టి ఆమె కాలుకి మందులురాసే బాధ్యత నాన్న గారికి అప్పజెప్పి నేను వంటగదిలోకి నడిచాను. ఆ పూట వంట వండి పడేసింది నేను. మండీ మండని పొయ్యిముందు కూర్చొని ఉక్కిరి బిక్కిరిచేసే పొగ మధ్య కూర్చొని పిడికిలి బిగించి "నే నెంతమూర్ఖుడ్ని! ఇవ్వాళ ఆమె కాలుజారి బురదలో పడిందంటే అందుకు నేనే బాధ్యుడ్ని. ఇలా వంట చేత కాక తలకిందులౌతున్నానంటే అందుకు బాధ్యత నాదే. అమ్మ మంచం ఎక్కితే చేసిపెట్టే ఆడదిక్కు లేకపోయె. ఏమైనా సరే నా వివాహం జరిగి తీరాల్సిందే. అందుకు నా ఆటంకం ఏమీ వుండకూడదని నిశ్చయించుకున్నాను. మరయితే డబ్బు! డబ్బు! నా మనసంతా ప్రశ్నలతో నిండి పోయింది. కూచున్న చోటునించి లేవటానికి లేనిడబ్బు పెళ్ళంత తతంగాలకి ఎక్కడ్నించి వస్తుంది? అప్పు తెస్తే తీర్చే విధానం? అయితే అప్పు తీసుకోవటం, అది తీర్చలేకపోవటం ఇత్యాది బాధలేవి లేకుండా పెళ్ళిచేసుకునే మార్గం ఒక్కటే వుంది. ఎదురు తిరిగే అంతరాత్మని అణిచిపెట్టుకుని, కళ్ళు మూసుకుని, బోరవంచుకుని, సంస్కారం చంపుకుని వాళ్ళకి అమ్ముడుపోవటం. ఏ చీకూ చింతా వుండదు. ఏ సమస్యా వుండదు. అంతకుతప్పించి మరెవరికీ బాధవుండదు. లోకాన్ని ధిక్కరించి, అతీతంగా నడుచుకుంటానని, పదిమందిలోనూ లోకాన్ని తిట్టిపోసి డంబాలు పలికి చివరికి నలుగురితోపాటే మనమూ అనుకుని గప్‌చిప్‌గా మందలో చొరబడితే సరి.

ఆ సాయంత్రం నా హృదయం పూర్తిగా లొంగిపోయే సుత్తి దెబ్బ మరొకటి బలంగా తగిలింది. రాత్రి వంట చేస్తూ పొయ్యిముందు అమ్మ సొమ్మసిల్లి పడిపోతే కొద్దిలో తప్పి పోయింది. కాని ఒళ్ళంతా కాలిపోవల్సినమాట. నాన్న చూసి చప్పున ఆర్పేశాడు. పరిస్థితులన్నీ యిలా నన్ను బల హీన పరుస్తుంటే నేను పూర్తిగా లొంగిపోయాను.

ఫలానావారి ద్వితీయ కుమార్తెతో నా వివాహం నిశ్చయం అయిపోయిం దన్నారు. తాంబూలాలు పుచ్చుకున్నారు. సుముహూర్తం నిశ్చయించుకున్నారు. శుభలేఖలు కూడా అచ్చయాయి.

అందంతో ప్రమేయం లేదనుకుంటూనే అందహీనమైన కన్యను ఎన్నుకోలేదు. విశాలాక్షి కంఠం చుట్టూ మూడు ముళ్ళూ వేసే తరుణంకోసం నా మనసు వేగిరపడసాగింది.

గలగలమంటూ రూపాయలు మావగారి చేతిలోంచి నాన్న చేతుల్లోకి దొర్లుతున్నప్పుడు క్షణం ఎవరో వెక్కిరిస్తున్నట్టుగా అనిపించి నా తలవంగిపోయింది. మూడువేల అయిదువందల రూపాయలు! మావగారి ముఖంలోకి చూశాను. ఆ డబ్బిచ్చి ఆయన నుదుటిమీద చెమట తుడుచుకున్నారు. అలా చెమట ఓడ్చి సంపాదించిన ధనం మూడువేల అయిదువందలూ ఆయన ఉచితార్థం నాన్న చేతిలో పోస్తున్నాడు. నాకళ్ళు మండాయి. ఈ ప్రపంచంలో కనీసం యీ దేశంలోనైనా, ఎక్కువమంది మొగవాళ్ళు పుడితే బాగుండును. ఆడవాళ్ళు కరువైపోతారు. కరువైన వస్తువు అపూ

Wishful thinking

ర్వమైపోతుంది. దానివలువ పెరిగిపోతుంది. అప్పుడు మొగ
వాళ్ళంతా ఆడపిల్లలకోసం వెతకటానికి వీధిని పడాలి. ఒక్క
క్షణంలో యీ మార్పు జరిగితే బాగుండును.

పెళ్ళి జరిగిపోతోంది. ఆకాశమంత పందిరికింద పిరపిర
లాడిపోతున్నారు జనం. పెళ్ళిపెద్దలు కాళ్ళూ చేతులూ పిరగ
దొక్కుకుంటున్నారు. అరుస్తున్నారు, తిడుతున్నారు, తిట్లు
తింటున్నారు. ఉక్కబోయ్యకుండా కొంతమంది విసురు
తున్నారు. విసిరించుకొంటున్నారుకొంతమంది. ఆడవాళ్ళంతా
ఒకవైపూ, మొగవాళ్ళంతా ఒక్కవైపూ_పిల్లలు తటసంగా
అటూ యిటూ తిరుగుతున్నారు. పందిరి రాటల కెగబ్రాకు
తున్నారు. వస్తున్నారు, వెళ్తున్నారు. అందమైన కంఠాన్ని
శంఖంతో పోలుస్తారు. ఆ శంఖంచుట్టూ తాడు బిగించాను.
చప్పున అప్రయత్నంగా మూడువేల అయిదువంద రూపా
యలూ నాన్న చేతిలోపోసి నుదుటిమీద చెమట తుడుచు
కున్న మావగారివైపు చూశాను. ఆ ముఖంలో సంతోష
ఛాయలు నా వీపుమీద ఛెళ్ళుమని కొరడాదెబ్బలు కొట్టి
నట్టుగా ఫీలయ్యాను.

పెళ్ళి కాస్తా అయిందనిపించారు. ఘనంగా జరిగిందని
ఆడపెళ్ళివారనుకుంటే అది యదార్థమైనా బెట్టుకోసం "ఏదో
బాగానే జరిగింది" అన్నారు నా వైపుచుట్టాలు. ఆ మాత్రం
అనకపోతే మూడువేల అయిదువందలు యిచ్చుకున్నవాళ్ళకి
లోకువైపోతావేమోనని మా వాళ్ళ ఉద్దేశం. ఈ లోకువని
ఆసరాగా తీసుకుని ముందు ముందు జరగాల్సిన లాంఛనాల్లో
ఏమైనా లోపం చేస్తారేమోనని భయం. రాబట్టటానికి అవ

కాశం ఉన్నచోట వచ్చినంతా పిండాలనే తత్వంవాళ్ళు నా వైపు పెళ్ళి పెద్దలు. నా మనసులో సంఘర్షణ తిరిగి దాని వునికిని బలపర్చుకోసాగింది. ఏదైనా మంచిపుస్తకం తీసి చదువుదామనిపిస్తే 'అది చదివే అర్హత నాకుందా?' అనిపిస్తోంది. పెద్దవాళ్ళతో మాట్లాడదామనుకుంటే ఆ సంస్కారుల ముందు నిలబడే అర్హత నాకుందా?అని సంకోచం పుడుతోంది. ఇలా యెంతకాలం యీ సంఘర్షణకి నిలయమైన యీ మనసును భరిస్తూ వుండగలను? కూడదనుకుంటూనే వొట్టు పెట్టుకుని, చివరికి నిలవలేక ఓడిపోయి చరిత్రహీనుడినైపోయాను. నా వ్యక్తిత్వం నేను నిలబెట్టుకోలేకపోయాను. లోకానికి చెప్పగలిగాను గాని చెయ్యలేకపోయాను. నాదీ ఓ జీవితమేనా? ఇలా సతమతమైపోతున్న నాకు మార్గాంతరమొకటి కనిపించింది. చల్లగాలికోసం కిటికీ వారగా కూచున్నప్పుడు మెరుపులా స్ఫురించిందో ఉపాయం. ఎవరిదగ్గరైనా ఓ పదిరూపాయలు తీసుకునేటప్పుడు బాధగానే వుంటుంది. కాని తిరిగి ఆ సొమ్ము, బాకీ తీర్చేటప్పుడు చాలా తేలిగ్గా, బరువు తగ్గినట్టుగా అనిపిస్తుంది. మావగారు తండ్రిచేతిలో పోసిన మూడు వేల అయిదువందలూ అప్పు తీసుకున్నట్టుగా భావిస్తే? ఎంత చక్కని ఆలోచన! నా మనసు యిప్పటికి శాంతించింది. నా వ్యక్తిత్వం నేను నిలబెట్టుకోగలిగే ఆస్కారం కనిపించింది. బాగుంది! చాలా బాగుంది! అద్భుతంగావుంది! అప్పనంగా తీసుకోవటానికీ, అప్పుగా తీసుకోటానికీ చాలా తేడావుంది. కాబట్టి ఈ సొమ్ము సాధ్యమైనంత త్వరలో తీర్చాలి. అందుకు

నేను యిప్పట్నించి తగిన జాగ్రత్తలో వుండాలి. తీర్చకపోతే నా మనసుకి ఊరటకలదు. మావగారిదగర తీసుకున్న మూడు వేల అయిదువందలూ బాకీ! కట్నం పుచ్చుకోకుండా విశాలాక్షిని పెళ్ళిచేసుకున్నాను. "ఓహో! సెభాష్! మంచిపని చేశావు. నువ్వెలాగైనా సంస్కారం కలవాడివి" అని నలుగురూ మెచ్చుకుంటున్నట్టే అనిపించింది నాకు. మళ్ళీ మామూలు స్థితిలోకివచ్చి నా ఊహలకి నేనే నవ్వుకున్నాను. బాకీ తీర్చినప్పుడు కదా నేను సంస్కారిని అనిపించుకునేది! అప్పటివరకూ లోకంతోపాటే.

తీర్చాలి! వడ్డీతోసహా తీర్చాలి!

"మూడు వేల అయిదువందలు ఏపాటి కట్నంరా? అయిదారు వేలన్నా గుంజద్దూ" అంటూ కామాక్షమ్మపిన్ని సాగదీసుకుంటూ గదిలోకొచ్చింది.

"సరేలే యీ మూడు వేలే యెలా తీర్చటమా అని సతమతమౌతుంటే ఆరు వేలే! ఇక నా వ్యక్తిత్వంమీదా, సంస్కారాభిలాషమీద ఆశ వొదులుకోవాల్సిందే. జీవితాంతం నలిగి నలిగి చచ్చిపోటానికీ, మనః స్తిమితం లేకపోవటానికీనా ఆరువేల కట్నం తీసుకోవటం?" అని మనసులో అనుకుని "ఏదో ఆపాటి చాలెద్దూ. వాళ్ళుమాత్రం మనుషులుకారూ? సామాన్య సంసారులు ఎక్కడ్నించి తేగలరు?" అన్నాను.

పెరట్లో ఉన్న అమ్మనుద్దేశించి పెద్దగా అరుస్తూ "విన్నావుటే అక్కా! నిన్నగాక మొన్న పెళ్ళయిందో లేదో అప్పుడే పాళ్ళని వెనకేసుకుని కప్పుకొస్తున్నాడు నీ కొడుకు.

ఆరి పిడుగా"— ఈ కంఠం క్రమంగా దూరం అయి గాలిలో కలిసిపోయింది.

మొత్తానికి నా పెళ్ళివల్ల నేననుకున్నట్టుగా మా యింట్లో పెద్ద వాళ్ళందరికళ్ళూ చల్లబడ్డాయి. ముఖ్యంగా అమ్మ చాలా సంతోషించింది. అదే నాకు పదివేలు. "మా నాయన చాలా మంచివాడు. నా మాట వింటాడు" అంటూ నన్ను ఆకాశాని కెత్తేసింది.

నా ఉద్యోగాన్వేషణ సాగుతూనేవుంది. కనిపించిన వాడి నల్లా దేబులాడుతూనే వున్నాను. పత్రికల్లో పడిన ప్రకటనల కెల్లా దరఖాస్తులు పడేస్తున్నాను. రెండు నెల్లకోమారు "ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి"కి వెళ్తున్నాను. ఇలా నెలలు గడిచిపోతున్నాయి. విశాలాక్షి కాపరానికి వచ్చింది. వచ్చిన ఏడాదికి సుపుత్రుడ్ని కని కూచుంది.

ముగ్గురుతో వున్న సంసారం అయిదుగురమైపో యాము. సంసారం వృద్ధి చెందుతోంది. కాని రాబడి పెరగ లేదు. పిల్లవాడికి మూడు మూన్నాళ్ళకి మందులూ, మాకులూ డాక్టర్లూ... ఒక్క ముక్కలో చెప్పాలంటే ముందు నేనూహిం చినట్టుగానే అయింది. నాన్నకి కొద్దికొద్దిగా నే నన్నమాటలు అర్థం అవుతున్నాయి కాబోలు, ఏదో అయిపోయిందానికి ఏం చేస్తాం అన్నట్టుగా మసులుతున్నాడు. అమ్మమటుకు మంచి విశ్రాంతి తీసుకుంటోంది. మధ్యాహ్నంవంట ఆమె చేస్తే రాత్రిపూట విశాలాక్షి చేస్తోంది. సగం బాధ్యత పంచు కుంది. ప్రయోజకత్వం లేనివాడిలా నక్కినక్కి తిరుగుతున్నా

నింట్లో. ఓ పక్క జంజాటం, మరోచెంప ఋణభారం, యీ రెండూ భరిస్తూ మంచిరోజుల్కోసం భగవంతుని ప్రార్థిస్తూ గడుపుతున్నాను. మామగారి రక్తం నాకు ధారబోశాడు. ఆ ఋణం ఎంత త్వరగా తీరుతే అంత త్వరగా నేను మనిషి ననిపించుకుంటాను, తీర్చితీరుతాను. ఆ పట్టుదల నాలో సడల లేదు.

అదృష్టం కలిసొచ్చింది. విశాలాక్షి రెండోమారు కొడుకునో, కూతుర్నో కనడానికి సిద్ధంగావున్న రోజుల్లో ఉద్యోగం దొరికింది. దొరికింది గుమాస్తా గిరి అయినా నా మనసు గవర్నరు గిరీ చెలాయించబోతున్నట్టే గర్వించింది. ఆ నాలుగురోజులూ దేశాన్ని ఉద్ధరిస్తున్నట్టే బోర విరచి తిరిగాను. నెలకి డెబ్భై అయిదురూపాయలు ముడుతున్నాయి. సంసారం ఒడుదుడుకులు లేకుండా సాగిపోతోంది. నెలకి పదిహేనురూపాయలు ఎవరికీ తెలియకుండా వెనకేస్తున్నాను. మామగారి ఋణం తీర్చాలనే పట్టుదల నన్నలా చేయిస్తోంది.

"ఏమండీ యింట్లో అందరికీ బట్టలు చిరిగిపోయాయి! నా మాట అలాగుంచండి, అత్తగారికీ మామగారికీ అయినా నాలుగుబట్టలు తీసుకురండి. మీరూ కుట్టించుకోవాలి" అంది విశాలాక్షి నా చిరిగిపోయినచొక్కా చేతిమీదమాసిక వేస్తూను.

అవును. విశాలాక్షి చెప్పింది నిజమే. బట్టలు కొనాలి. అయితే మరి డబ్బు! "అలాగే కొందాం" అనేసి వీధిలోకి వచ్చేశాను.

* * *

"సంసారంలో రాబడికీ ఖర్చుకీ సరిగ్గా సరిపోతోంది. ఏమీ మిగలటంలేదు. అక్కడికదే అదృష్టం అనుకోవాలి. అప్పులు మట్టుకు లేవుగా" అన్నాను విశాలాక్షితో. ఏదో ఖర్చులూ రాబడులూ ఆ ప్రస్తావన వస్తేను.

"అవుననుకోండి. ఎలాగో తీర్చుకుంటాం. ఏభై రూపాయలన్నా లేందే ఏంచాలుంది? నాలుగు బట్టలుకూడా రావు. అత్తగారు మరీ యిబ్బంది పడిపోతున్నారు."

"ఎక్కడ్నించి తీసుకురాను."

"ఇన్నాళ్ళనించీ యీవూళ్ళో వుంటున్నారు, ఏభై రూపాయలు అరువిచ్చే స్నేహితుడు లేడటండీ!" అంది విశాలాక్షి వింతగా నోరు ఆవులించి.

"లేకేం. ఉన్నారనుకో. అడగటానికి నా మనసు ఒప్పదు."

"ఎలాగో చూడాలి మరి. ఇబ్బంది పడతామా ?"

విశాలాక్షి ప్రోత్సాహంమీద నోరుతెరిచి అడిగి ఒకడి దగ్గర లేదనిపించుకొనీ, వరొకడి దగ్గిర తీసుకొచ్చి బట్టలు కొన్నాను. ఇంతాచేస్తే నా శ్రమా డబ్బూ కనిపించాయి గాని వచ్చినవస్తువులు ఏపాటి! అమ్మకి రెండుచీరెలు, నాన్నకి రెండు పంచలు, నాకు రెండుచొక్కాలు, పిల్లాడికి ఓ లాగూ చొక్కా వచ్చాయి. అక్కడికదే నయం!

మావగారికే కాకుండా మరో మిత్రుడికూడా ఋణపడి వున్నాను. ఋణం! నా నరాలు పీక్కుపోయాయి. వారం

రోజుల్లో యిస్తానన్నాను. ఫస్టుతారీకు యిక పదిరోజులుంద నగా నాన్న మంచానపడ్డాడు. ఫర్వాలేదు రెండు రోజుల్లో నయం అయిపోతుందనుకొంటే వారంరోజులు కళ్ళు తెరవ లేదు. జ్వరం చెక్కలమంటలా పేలిపోయింది. ఇరవై లంక ణాలు చేశాడు. మందులకైతేనేం, చూసిపోవటానికి తీసు కొనే ఫీజుకైతేనేం? ఈ యిరవై రోజుల్లోనూ వందరూపాయలై పోయాయి. నేను రహస్యంగా వెనకవేసిన వందరూపాయలూ యెంత వద్దనుకొన్నా ఖర్చుపెట్టక తప్పలేదు. స్నేహితుడు దగ్గర తీసుకొన్న ఏభైరూపాయల బాకీ అలాగేవుంది.

మావగారి మూడువేల అయిదువందల ఋణం నా మన సులో తిరుగుతూనేవుంది. తీర్చటంకోసం చేసిన మొదటి ప్రయత్నం వ్యర్థమైపోయింది.

ఒకనెల యింటెడు చుట్టాలు వచ్చిపడ్డారు. ఆ నెలలో పచారీకొట్లో అరువు సగం పెరిగిపోయింది. ప్రతినెలా పాతికా ముప్ఫై అవుతుంటే ఆ నెల ఏభై మించిపోయింది. వెళ్ళే వాళ్ళని వెళ్ళనివ్వకుండా "రాకరాక వచ్చారు ఓ రవికల గుడ్డ యినా పెట్టొద్దూ. పిల్లలకు తలోలాగు కుట్టించకపోతే బాగుండదు. మొగాళ్ళకి తలో కండువా కొనిస్తే చాలు" అంటూ సాగదీసింది అమ్మ.

నా గొంతు ఎండిపోయింది.

బట్టలకొట్లో అరువుపెట్టాను. అదో పాతికరూపాయ లైపోయింది. ఇలా కుక్కగొడుగుల్లా అప్పులు నెమ్మదిగా పెరగసాగాయి. అవి సర్దుకోటానికి నెలకొచ్చే జీతం చాలటం

లేదు. ఈ గొయ్యి పూడ్చటానికి మరోచోట గొయ్యి పెట్టాల్సి రావటంతో ఎంతొస్తుందో ఎంత పోతుందో లెఖ్ఖా జమా వుండటంలా. మొత్తానికి నేనూ అప్పులవాడ్నయిపోయాను. మెడమీద తలకాయ వున్నవాళ్ళంతా నాకు ఋణదాతలయి పోయారు. సాధ్యమైనంతవరకూ నన్ను తప్పించుకు తిరుగు తున్నారు కొంతమంది. మరి కొంతమందిని నేనే తప్పించుకు తిరుగుతున్నాను.

అమ్మ మంచాన పడింది. పది లంఖణాలు చేసింది. విశాలాక్షి నయం, అయిదారు లంఖణాలతో సరిపోయింది. పిల్లలకి సరేసరి మూడూ మూడ్నాళ్ళకీ మందులూ మాకు లూను. నా ఆరోగ్యంకూడా ఏవీ బాగుంటడంలేదు. ప్రతి రోజు బత్తాయికాయల రసం తాగమంటూ వైద్యుల సలహా. రోజుకి పావలా ఖర్చు. ఆరోగ్యం కోసం పుచ్చుకుతీరాలని విశాలాక్షి రొక్కించటంతో సందుమొగలో వున్న పళ్ళదుకాణంలో అరువు పెట్టాను.

మొత్తానికి ఓనాడు లెఖ్ఖవేస్తే తీర్చాల్సిన బాకీలు నాలుగ్గైదువందలు తేలాయి. దీనికి మరొక కారణం; ఈమధ్య రెండు నెలలు, నెలకి నలభై రూపాయలు చొప్పున వచ్చే అద్దె పోయింది. ఇదివరకున్నవాళ్ళు ఖాళీచేసి పోయారు. రెండు నెలలు ఇల్లు ఖాళీగా వుండిపోయింది. ఈ నెలనించీ కొత్త వాళ్ళు వచ్చి దిగారు.

సంసారం పెరిగింది! ఖర్చులు పెరిగాయి, రాబడిచాల

టంలేదు. అప్పులు పెరుగుతున్నాయి. గోతులు త్రవ్వటం, గోతులు పూడ్చడంతో సరిపోతోంది.

రోజులు గడిచిపోతున్నాయి. ఇప్పుడు నాకు యిద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలూను. నిన్ననే నాముప్ఫై ఒకటో పుట్టిన రోజు వచ్చింది. తలంటుపోసుకుని ఉన్న వాటిల్లో మంచి బట్టలు కట్టుకుని విశాలాక్షిని తీసుకుని సినిమా కెళ్లాను. పాతికేళ్ళ విశాలాక్షి నలభై యేళ్ళవిశాలాక్షి ఎలాగుంటుందో అలాగుంది. నడుం వంగిపోయింది. మెడకొంకులు బయట పడ్డాయి. గులాబిరంగు బుగ్గలు, నవ్వితే సొట్టలుపడే బుగ్గలు చిదక దవడలు పడ్డాయి. పెద్ద పేరక్కలా కబుర్లు చెబుతోంది. ఇరుగు పొరుగు వాళ్ళంతా విశాలాక్షమ్మగారూ అంటూ పిలుస్తుంటారు. ఇంతెడు బాధ్యత విశాలాక్షి ఒక్కతే భరి స్తోంది. అమ్మ నా పీకమీదకూచుని ఎంత వద్దన్నా వినిపించు కోకుండా రెండొందలరూపాయలు తీసుకొని పొరుగింటి ముస లమ్మలు తీర్థయాత్రలకి పోతుంటే తనూ వాళ్ళతో కలిసి వెళ్ళిపోయింది. తిరిగి రావటానికి కనీసం మూడు మాసాల యినా పడుతుంది. డబ్బు అవసరముంటే ఉత్తరం రాస్తానంది. రెండొందల రూపాయలు! నెలకి నూటికి రూపాయి వడ్డీ చొప్పున తీసుకొచ్చి అంత సొమ్మూ ఆవిడ చాదస్తానికి బలి పెట్టాను.

రెండో పిల్లాడ్ని బళ్ళో వేశాం. అక్షరాభ్యాసాని కంటూ కొంత ఖర్చు. మామగారు మటుకు నా మనసులో ఒక ప్రక్క తన ఉనికిని తెలియచేస్తు నేవున్నారు. మూడువేల అయిదువందల బాకీ!... నా జేబులో దమ్మిడీలేదు. పట్టుదల

మటుకు పుష్కలంగా వుంది. తీర్చాలి! నా మనసులో ఓ పక్క పీకుతూనే వుంటుంది.

అసలీ పెళ్ళి ఎందుకు చేసుకున్నాను. నే బావుకున్న దేముంది? పిల్లల్ని కని, అప్పులు చేసుకుని, సంస్కారం లేకుండా, ఆత్మ కాల్చుకుని, మూడువేల కట్నం తీసుకుని యిలా పతనమైపోవటానికి తప్పించి మరెందుకూ కాదు. మనసులో అశాంతికి మందు 'ఇల్లూ వాకిలీ విడిచిపెట్టి పారిపోవటం' అంటూ గోవిందం అంటూంటే వెఱ్ఱివాడనుకునేవాడ్ని. కాని అది నిజమేమో అనిపిస్తోందిప్పుడు. ముప్ఫైయేళ్ళ తోడి గుమాస్తా వెంకట్రావు ఉదయం నేను లేవకుండానే వచ్చాడు మా యింటికి.

విశాలాక్షి వచ్చి లేపింది, "ఎవరో మీ కోసం వచ్చారు" అని.

లేచి ముఖం కడుక్కుని వీధిగదిలో కెళ్ళాను. వెంకట్రావు కుర్చీలో కూర్చున్నాడు. "ఓ నువ్వా! ఏమిటి యిలా వచ్చావు" అంటూ పలకరించాను.

"రేపు పదిహేనో తారీఖున వివాహం నిశ్చయమైంది" అన్నాడు ముసి ముసిగా నవ్వుతూను.

"చాలా సంతోషం! ఎవరువాళ్ళు?"

"ఈ ఊరే. ఏమంత ఉన్నవాళ్ళుకారు. ఆయన బాంకులో పనిచేస్తున్నాడు."

"కట్నం ఏ మాత్రం?"

"దమ్మిడీ కట్నం పుచ్చుకోవటం లేదు."

నా ముఖం మాడిపోయింది. ఎదురుగుండా మావగారు కూర్చుని ఎత్తిపొడిచినట్టుగాఅనిపించింది. వేలవంగా నవ్వుతూ "చాలా గొప్ప విషయం" అన్నాను. నాతల తిరిగిపోతోంది. మూడూ, అయిదూ, రెండు సున్నాలూ గజిబిజిగా నా మనో నేత్రం ముందు తిరిగిపోసాగాయి. మూడు వేల అయిదువందల కట్నం! పదిసంవత్సరాలై పోయింది. నలుగురుపిల్లలు పుట్టారు. అప్పులు పెరిగిపోయాయి. సంసార సాగరంలో నిండా మునిగి వున్న నేను, అప్పుడే నూతనంగా సంసార జీవితంలోకి అడుగు పెట్టబోతున్న వెంకట్రావుని చూసి అసూయపడ్డాను. చేసిన తెలివితక్కువ పని భూతద్దంలోంచి చూసినట్టుగా మరింత స్పష్టంగా కనిపిస్తోంది; తెల్లటి గోడమీద మసిబొగ్గు గీతలా.

నా మెదడు మావగారి ఋణం తీర్చుకుని నేనూ సంస్కారిని అనిపించుకుని ఆత్మశాంతి చేకూరే మార్గాంతరం కోసం ఆలోచనతో నిండిపోయింది.

పిల్లలు వెంకట్రావుని చుట్టముట్టి వింతగా వాడి ముఖం లోకి చూస్తుంటే నాకు వె(్రెత్తి పొమ్మని కసిరి కొట్టాను. తుర్రుమని పారిపోయారు వాళ్లు.

"అదేవిఁటిరా వాళ్ళనలా కసురుకుంటావు పాపం !" అని వెంకట్రావు నన్ను మందలించాడు.

"నా బుద్ధి మాంద్యానికి, నా తెలివితక్కువకి యీ నలుగురూ ప్రత్యక్ష నిదర్శనం" అన్నాను.

"ఛా ! అదేమిటిరా అలాగంటావు! నా అనేవాళ్ళె వరూ లేకపోబట్టి యిలా యింతకాలం బ్రహ్మచారిలా పడు న్నానుగాని, ఎప్పుడో పెళ్ళయిపోయివుండాల్సినమాట. ఇంత

ఆలస్యంగానా పెళ్ళికావటం?" వెంకట్రావు చెప్పిందాన్లో నిజం ఏ మాత్రమూ లేదు. నా బాధ వాడికి అర్థంకాదు. నలుగురు పిల్లలూ, భార్య, తల్లీ, తండ్రీ, ఈ సంసారం చూట్టానికి అందంగానే వుంటుందిగాని అందులో జంజాటం వీడికేం తెలుస్తుంది ?

వాడు వెళ్ళిపోగానే స్నానానికి పెరట్లోకి నడిచాను. నాన్న మొక్కల్లో కూచుని నీళ్ళు పడుతున్నాడు. విశాలాక్షి వంటగదిలో వంట ప్రయత్నంలో మునిగిపోయింది. నీళ్ళు పోసుకుంటుంటే మెదడు వెంకట్రావు గురించే ఆలోచిస్తోంది.

మూడు వేల అయిదువందలు! పది సంవత్సరాల క్రితం తీసుకున్న బాకీ, ఇంతవరకూ తీర్చని బాకీ, మూడు వేల అయిదు వందలు !

సంసారం సాగిపోతోంది. అప్పులు తీరటంలేదు; పెరగటంలేదు. వయస్సు పెరుగుతోంది. కాని మూడు వేల అయిదు వందల బాకీ అలాగే వుంది.

"నాన్ననీ, అమ్మనీ చూడాలని వుంది" అంది విశాలాక్షి. వెళ్ళమన్నాను. అప్పులో అప్పు ముప్ఫయి రూపాయలు చేతిలో పెట్టి పంపించాను. నెలరోజులుండి వచ్చింది.

వచ్చి కన్నీళ్ళు కారుస్తూ అక్కడ విషయాలన్నీ చెప్పుకొచ్చింది. "నే వెళ్ళేసరికి నాన్న బాగా నీరసించి వున్నాడు. కంగారుపడతామని మనకి రాయలేదుగాని చాలా జబ్బు చేసిందట ! ఇంకా ఈ వయసులో కూడా తాపత్రయం తప్ప లేదు. పొద్దల్లా కష్టపడుతూనే వుంటాడు. ఎండనీ కొండనీ తిరుగుతాడు. వెనకేసుకున్నది చిల్లిదమ్మిడీలేదు. సంపాదించిం

దంతా పిల్లల పెళ్ళిళ్ళకే అయిపోయింది. అప్పులుమట్టుకు మిగిలాయి" అంటూ కన్నీరు తుడుచుకుంది.

నా శరీరమంతా సిగ్గుతో చచ్చిపోయింది. నావంతు మూడువేల అయిదువందలైనా పుచ్చుకోకపోతే ఆయనకి ఈనాడు యింతలా కష్టపడాల్సిన అవసరం తప్పేది. వెంకట్రావు జ్ఞాపకానికి వచ్చాడు. తల వంచుకుని వీధిలోకి వచ్చేశాను. మావయ్యగారు పెద్దవారైపోయారు.

ఆయన శరీరంలో రక్తమంతా జలగల్లాగా పీల్చుకుని తాగేశాం మేము. సంస్కారం కలవాడ్నని విర్రవీగిన నేను పతితుడ్నయిపోయాను. ప్రత్యేకత కోసం పాకులాడిన నేను లోకంలో అందరితోపాటే అయిపోయాను. మూడువేల అయిదువందలు అణాపైసలతో సహా చెల్లించగలిగిన్నాడు గాని నా ప్రత్యేకత నాకు నీయదు. నేను వెంకట్రావు అనుకున్నంత సంస్కారిని కాను. కాకపోతే సంస్కారం అంటే ఏమిటో మట్టుకు తెలుసు. తెలుసున్నవాడ్ని కాబట్టే యిలా సతమతమైపోతున్నాను.

మరికొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. విశాలాక్షి మరో సుపుత్రుణ్ణి కన్నది. అమ్మ పెద్దదైపోయింది. నాన్న సరేసరి, ఎండి వరుగైపోయాడు. అయినాసరే మొక్కల్ని మట్టుకు విడిచిపెట్టడు. అమ్మ గొణుగుతూంటుంది. విశాలాక్షి మరీ కృశించిపోయింది. మందు పుచ్చుకుంటూనే వుంది.

అద్దంముందు నిలబడి అక్కడక్కడ నెరుస్తున్న వెంట్రుకలని చూసుకుంటూ ఏవో స్మృతులమధ్య ఊగిసలాడుతున్న

నేను "నాన్నా!" అంటూ సుజాత గదిలో ప్రవేశించటంతో అద్దంముందు నించి యివతలికి వచ్చాను.

"ఎందుకూ ?"

"అమ్మ పిలుస్తూంది. ఎవరో వచ్చారు నీకోసం"

నేను గది బయటికి నడిచాను. "టెలిగ్రాం వచ్చిందండీ ఎక్కడ్నించో – చూడండి" అంటూ ఆతృతగా విశాలాక్షి ఎదురువచ్చి కవరు అందించింది.

టెలిగ్రాం వచ్చిందనే సరికి నా మనసు కీడు శంకించింది.

చించి చదివాను. నానోట మాట పెగల్లేదు.

"మీ..."

"ఆఁ !...ఏమిటి?"...విశాలాక్షి నా రెండు చేతులూ పుచ్చుకుంది.

"మీ...నాన్నా..."

"ఆ...ఎలాగున్నాడు! చెప్పండి?" విశాలాక్షి కంఠం రుద్ధమైంది. నానోట మాట పెగల్టంలేదు. "చనిపోయారుట" అన్నాను. కళ్ళుమూసుకుని, గుండెలు చిక్కబట్టుకొని విశాలాక్షి కుప్పలా కూలిపోయి బోరున ఏడవసాగింది.

పెరట్లోంచి అమ్మా, నాన్నా పరుగెత్తుకొచ్చారు.

విశాలాక్షిని అంతా ఓదారుస్తున్నారు. ఆమె వుండి వుండి ఉప్పెనలాగ దుఃఖం పొర్లుకొస్తుంటే పెద్దగా ఏడుస్తోంది.

నా ఋణదాత చనిపోయాడు. నోటులేనిబాకీ మూడు వేల అయిదువందలు నేను ఎవరికి తీర్చేది ? అయ్యో ! బ్రతికున్నంతకాలం ఆయన కివ్వలేక పోయానే ! ఇచ్చినవాడే

false emotion

పుచ్చుకుంటే వుండే తృప్తి మరొకరు స్వీకరిస్తే ఎలా కలుగుతుంది నాకు!

విశాలాక్షిని వెంటబెట్టుకుని అక్కడికి వెళ్ళా. పది రోజులూ వుండి తిరిగి వచ్చేశాను. విశాలాక్షి మరో పదిరోజులుండి తిరిగి వచ్చేసింది. ఆమె తల్లి పదేళ్ళ పిల్లవాడ్ని తీసుకుని విశాలాక్షి అన్నగారి దగ్గరికి వెళ్ళిపోయింది. అతనెక్కడో దూరదేశంలో ఉద్యోగం చేస్తున్నాడు. వచ్చి కర్మకాండంతా పూర్తిచేసి వెంట తల్లినీ, తమ్ముడ్ని తీసుకుని పోయాడు.

"ఈ భూమ్మీద ఆఖరి గడియవరకూ నాన్న చెమట ఓడుస్తూనే వున్నాడు. కాని మిగిలిందేముంది? నిలవటానికి నీడైనా లేకుండా పోయింది. బొందిలో ప్రాణముండగానే వీధిలో పడేశారు"

నా గుండెలు కరిగిపోతాయి విశాలాక్షి... అలా గంటుంటె.

ఏమైనాసరే మూడువేల అయిదువందలూ తీర్చాల్సిందే. ఆ కుర్రాడి చదువుకైనా ఉపయోగపడుతుంది. అలా అని దృఢనిశ్చయం చేసుకున్నాను.

మరో సంవత్సరం గడిచిపోయింది.

మావగారి సంవత్సరీకాలకి అంతా వెళ్ళాం. ఆ నాలుగు రోజులూ వుండి వచ్చేశాం.

భోజనం చేసి వెన్నెట్లో కూచుని వున్నప్పుడు విశాలాక్షి ఉన్నట్టుండి అంది: "సుజాతకి పెళ్ళీడు వస్తోంది. మంచి సంబంధం ఏదైనా చూసి చేసెయ్యడం మంచిది. ఇప్పట్నించీ ఆ ప్రయత్నంలో వుంటేగాని వచ్చే ఏడాదికైనా సంబంధం

కుదరదు. మూడు నాలుగు వేలైనా పోయ్యందే యీ రోజుల్లో మంచి మంచి సంబంధాలు యెక్కడ్నించి వస్తాయి" అని.

"మూడు నాలుగువేలే ? !"— నా గుండెలు గుబ గుబ లాడాయి. రాయిపడ్డట్టుగా బరువెక్కి పోయింది హృదయం.

మరి మావయ్యకివ్వాల్సిన మూడువేల అయిదు వందలూ ?

నా పెళ్ళయి పన్నెండేళ్ళు దాటిపోయింది. నాకు అయిదుగురు సంతానం. వయస్సుతోపాటు అప్పులూ పెరుగుతున్నాయి. కాని రాబడిమటుకు పెరగలేదు.

—'హంస' మాసపత్రికనుండి